క్లుప్తంగా

రేపు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండల ప్రజా పరిషత్ పాలకమండలి సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాలని కోరారు.

ఎటపాక సీఐగా కన్నపరాజు



ఎటపాక: ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం. కన్నపరాజు నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏపీ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న కన్నపరాజును ఎటపాక సీఐగా బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేసిన డి.రామారావుకు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విస్తరణాధికారి ప్రకాష్

జి.మాడుగుల: వాతావరణ మార్పుల వల్ల సంభవించే వ్యాధుల పట్ల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్ తెలిపారు. మండలంలో సరియలబంద గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి, 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 9 మంది జ్వర పీడితులకు ఆర్‌డీటీ పరీక్షలు నిర్వహించగా మలేరియా లేదని తేలింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి నడికట్ల ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ ఎస్.బాలయ్య,వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న పార్టీ నాయకులు

గంగవరం: ప్రధాన మంత్రి మోదీ పిలుపుమేరకు అందరూ తమ ఇళ్ల వద్ద స్వాతంత్య్ర దినోత్సవం నాడు జాతీయ జెండా ఎగుర వేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సారపు పోతురాజు దొర కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి సూర్యచంద్ర, జిల్లా ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజం వెంకటేశ్వర్ల దొర, మండల ఉపాధ్యక్షులు పుట్టపల్లి నీలాలమ్మ, కిషన్ మోర్చా అధ్యక్షులు సారపు వెంకన్న, బీజేవైఎం కార్యదర్శి కత్రం వెంకన్న దొర, పొడుగు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వాలాబులో మెగా వైద్య శిబిరం నేడు

దేవరాపల్లి: సంఘ మిత్ర రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన పంచాయతీ వాలాబులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించే ఈ శిబిరంలో చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వైద్య నిపుణుడు బండారు రామచంద్రరావు, తదితర వైద్యులు సేవలందిస్తారన్నారు. పంచాయతీ పరిధి గ్రామాల వారు హాజరు కావాలని కోరారు.

13న వినియోగదారుల పరిష్కార వేదిక

గొలుగొండ: నర్సీపట్నం రూరల్ పరిధి గొలుగొండ, కోటవురట్ల, నాతవరం మండలాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదిక కార్యక్రమం నర్సీపట్నంలో ఈ నెల 13న నిర్వహించనున్నట్లు గొలుగొండ ఏఈఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆ రోజు వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదు చేసుకోవాలన్నారు. దీనికి జిల్లా అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

పర్యాటకుల సందడి



చీకుధార వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు



కొత్తపల్లి జలపాతం వద్ద సందర్శకులు



గుహల వద్ద పర్యాటకులు

రాజవొమ్మంగి/జి.మాడుగుల/అనంతగిరి(అరకులోయ రూరల్) : జిల్లాలోని పర్యాటక కేంద్రాల వద్ద శనివారం సందర్శకులు సందడి చేశారు. వరుసగా సెలవులు రావడంతో మోటారు సైకిళ్లు, కార్లు, వ్యాన్లలో చేరుకుని రోజంతా సరదాగా గడిపారు. రాజవొమ్మంగి మండలంలోని కిమ్మిలిగెడ్డ గ్రామ శివారున అటవీప్రాంతంలో గల చీకుధార జలపాతం వద్ద పర్యాటకులు ఉత్సాహంగా గడిపారు. యువతీయువకులు గంటలకొద్దీ జలకాలాడారు. ఇక్కడ లోతైన వాగులు ఏవీ లేకపోవడంతో ఈ ప్రాంతం సురక్షితమైనదిగా భావిస్తారు. చుట్టూ పచ్చని అడవి, ఎత్తైన కొండలు, సువాసనలు వెదజల్లే రకరకాల పూలు ఇక్కడికి వచ్చే వారిని ఆకర్షిస్తున్నాయి.

- జి.మాడుగుల మండలంలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొత్తపల్లి జలపాతం ఈ వారం పర్యాటకుల తాకిడితో కళకళలాడింది. గత కొన్ని రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు కొత్తపల్లి జలపాతం సందర్శకులు లేక బోసిపోయింది. వర్షాలకు తెరిపివ్వడంతో టూరిస్టుల తాకిడి మొదలైయింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జలపాతం జోరుగా ప్రవహిస్తోంది. ఈ దృశ్యాలకు తిలకించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు.హోరుమంటూ పారుతున్న జలపాత సవ్వడులను వింటూ పర్యాటకులు పరశించిపోతున్నారు.
- ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలను సందర్శించేందుకు శనివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. 1,700 మంది పర్యాటకులు సందర్శించగా రూ.1.39 లక్షల ఆదాయం వచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు. ఇక్కడి ప్రకృతి సౌందర్యం, చల్లటి వాతావరణం సందర్శకులను ఆకట్టుకుంది

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

అనంతగిరి(అరకులోయ రూరల్): మొక్కల పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షించ వచ్చని సర్పంచ్ జన్ని అప్పారావు తెలిపారు. మండలంలో బొర్రా పంచాయతీలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అప్పాలరాజు ఆధ్వర్యంలో శనివారం 10 మంది రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ పర్యావరణానికి ముప్పు పెరుగుతోందని చెప్పారు. రైతులు సిల్వర్ ఓక్ మొక్కలు విరివిగా నాటాలని తెలిపారు.

చురుగ్గా జల్‌జీవన్ మిషన్ పనులు



గడుగుపల్లిలో వాటర్ ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శోభారాణి

పెదబయలు: మండలంలోని కిముడుపల్లి పంచాయతీలో జల్‌జీవన్ మిషన్ పనులు చురుగ్గా జరుగుతున్నట్టు కిముడుపల్లి సర్పంచ్ శోభారాణి తెలిపారు.శనివారం గాదేపల్లిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు, గడుగుపల్లిలో జల్‌జీవన్ మిషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీవీటీజీ గ్రామాల్లో నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



రైతులకు చేపపిల్లలు పంపిణీ చేస్తున్న వాసన్ సంస్థ ప్రతినిధులు

చింతపల్లి: చెరువుల్లో చేపల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వాసన్ సంస్థ ప్రతినిధులు సన్నీ, దామోదర్ తెలిపారు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో వాసన్ సంస్థ గిరిజన రైతులకు ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేసింది. మండలంలోని పలు పంచాయతీల్లో శనివారం ఈ కార్యక్రమం చేపట్టింది. రైతులు తాము సొంతంగా నిర్వహించే చెరువులు, ఉపాధి హామీ పథకం ద్వారా తవ్విన చెరువుల్లో వీటిని పెంచుకోవాలని సంస్థ ప్రతినిధులు సూచించారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి, జి.మాడుగుల మండలాల్లో సుమారు 1.20 లక్షల చేపపిల్లలను పంపిణీ చేశామన్నారు. ఫీల్డ్ ఆర్గనైజర్ పడాలగాంధీ, పెదబరడ సర్పంచ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్సను గెలిపిద్దాం

మాజీ విప్ కరణం ధర్మశ్రీ



ఎంపీటీసీల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను గెలిపిద్దామని మాజీ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. రోలుగుంటలోని జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ నివాసంలో మండల స్థాయిలో పార్టీ ఎంపీటీసీలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ధర్మశ్రీ హాజరై సెగ్మెంట్ల వారీగా ఎంపీటీసీలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. దీనిపై ఎంపీటీసీలందరూ పార్టీ బలపరచిన అభ్యర్థికే తమ మద్దతు అని స్పష్టం చేశారు. పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలే తమకు శిరోధార్యమన్నారు. అనంతరం ధర్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రలోభాలు పెట్టినా 350 ఓట్ల పైబడిన మెజార్టీతో బొత్స గెలుస్తారన్నారు. జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ దోసపత్ని వరలక్ష్మి, ఎంపీటీసీలు వద్దాది సతీష్, నాయకులు పోతల లక్ష్మీశ్రీనివాస్, కర్రి రాము, తమటపు సత్యంనాయుడు, ఉలబాల రాము, లగుడు కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పంద్రాగస్టు పోటీలు



వడ్డాదిలో వాలీబాల్ పోటీలు



వడ్డాదిలో ఖోఖో ఆడుతున్న కాలేజీ విద్యార్థులు

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలో హోరాహోరీగా ఆటల పోటీలు సాగుతున్నాయి. పంద్రాగస్టు సందర్భంగా శనివారం కాలేజీ యాజమాన్యం విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, రన్నింగ్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో విద్యార్థిని, విద్యార్థులు హుషారుగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న వారందరికీ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందిస్తామని ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. అధ్యాపకులు నరసింహమూర్తి, సుధీర్, శ్రీనివాస్ తదితరులు విద్యార్థుల మధ్యన స్నేహ సంబంధాలు ఉండేలా ఆటల పోటీలు నిర్వహించారు.

డెంగ్యూపై అవగాహన కార్యక్రమం



ఎ.భీమవరంలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి తరణి

కె.కోటపాడు: ప్రస్తుత వర్షాకాలంలో దోమకాటుతో ప్రజలు డెంగ్యూ, మలేరియా బారిన పడే అవకాశముందని వైద్యాధికారి తరణి తెలిపారు. డెంగ్యూ బారినపడకుండా ఉండేందుకు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై ఎ.భీమవరంలో శనివారం ఆమె వివరించారు. ఇంటి పరిసరాల్లో రోజుల కొద్దీ మురుగు ఉండకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, హెచ్.వి.అచ్చియ్యమ్మ, ఎ.ఎన్.ఎం.దేవి, ఎంఎల్.హెచ్.పి. హేమ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే బతికేదెలా ?



కార్మికులతో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

చింతపల్లి: జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బకాయిపడిన నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం యూనియన్ జిల్లా కార్యదర్శి పసుపులేటి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 400 మంది మధ్యాహ్నం భోజన కార్మికులున్నారని, జిల్లాలో ఐదు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. తక్షణమే వేతనాలు చెల్లించకుంటే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.పద్మ, సింహాచలం, శకుంతల, చంద్రకళ, దినకుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

150 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు



యర్రగొండ ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి నరేంద్ర

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గ్రామ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం 150 మంది విద్యార్థులకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు. చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరేంద్ర ఆధ్వర్యంలో పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. రక్తహీనత ఉన్న బాలికలను గుర్తించి, వారు తీసుకోవలసిన పౌష్టికాహారం, వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు. ఈవైద్యశిబిరంలో డాక్టర్ దినేష్, పాఠశాల ప్రిన్సిపాల్ బి.ఆర్. భైరవ, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సరకుల సరఫరాలో నిర్లక్ష్యం



జీసీసీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న సీఐటీయూ మండల కార్యదర్శి శంకరరావు,నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల రంగబయలు,వనుగుమ్మ పంచాయతీల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు డీఆర్ డీపోల నుంచి రేషన్ సరకులు సరఫరా చేయడంతో సేల్స్‌మెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక జీసీసీ కార్యాలయంలో అధికారులకు శనివారం సీఐటీయూ నేతలు ఫిర్యాదు చేశారు. సరకులు అందించడంలో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని అధికారులకు వారు వివరించారు.ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి శంకరరావు మాట్లాడుతూ వనుగుమ్మ,రంగబయలు పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వారం రోజుల తరువాత నచ్చినట్టుగా సరకులు ఇస్తున్నారని చెప్పారు. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది లబ్ధిదారులకు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రతి నెలా సక్రమంగా సరకులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్,సీపీఎం నేతలు భీమరాజు,మంగ్లీ,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు



డుంబ్రిగుడలో మాట్లాడుతున్న యూటీఎఫ్ ప్రతినిధి రఘునాథ్



రాజవొమ్మంగిలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న సభ్యులు



ముంచంగిపుట్టులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

అనంతగిరి(అరకులోయ రూరల్): యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో కాశీపట్నం మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాల ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు.యూనియన్ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ విశాఖ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు శెట్టి రాంబాబు మాట్లాడుతూ 1974లో ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించినట్టు చెప్పారు. అప్పటి నుంచి నేటి వరకు ఎన్నో పోరాటాలు చేసిందని చెప్పారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సింహాచలం,సంఘం నాయకులు విజయ్,శెట్టి పరమేశ్వరరావు, నారాయణరావు, గంగరాజు, స్వామినాయుడు, వెంకటరావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానిక సంతవలస పాత ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేష్ (యూటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భగా యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కె.రఘునాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేయడంలో యూనియన్ అగ్రగామిగా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.కన్నయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణ, ఎం.బాబురావు, మండల నాయకులు మేఘనాథ్, దుక్కు, లింగన్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగిలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పైడిమల్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైనికునిల్లా పనిచేస్తూ ప్రభుత్వ విద్యావిధానాన్ని పరిరక్షించుకోవాలన్నారు. గౌరవ అధ్యక్షులు సత్యవతి, రాష్ట్ర కౌన్సిలర్ మఠం ఉదయ్, ఇంకా వెంకటలక్ష్మి, రమణ,శ్రీను, రమేష్, గంగరాజు, రాజుబాబు, కొండబాబు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా యూటీఎఫ్ పనిచేస్తోంది యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మొశ్యా ధర్మారావు అన్నారు. మండల కేంద్రం ముంచంగిపుట్టులో శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ఎన్నో పోరాటాలు చేసిందని చెప్పారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష,కార్యదర్శులు రాజు,గోపి,యూటీఎఫ్ సీనియర్ నాయకులు సూర్యనారాయణ, చిన్నయ్య, ఉపాధ్యాయలు త్రినాథం, పుండరీ, ధనుపతి, దాసు, గోవింద్, దాసయ్య, తిరుపతి, రఘుమణి, గణేష్, పద్మసేన్, జీవన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ



పెన్నులు,పుస్తకాలు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

కొయ్యూరు: పేద విద్యార్థులకు సాయం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని రెవెన్యూ శాఖ డీటీ దుమంతి సత్యనారాయణ అన్నారు.ఆయన శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో అడవి బిడ్డలకు విద్యాదానం పేరిట విద్యార్థులకు పెన్నులు,అట్టలు,నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే దేనినైనా సాధించే అవకాశం ఉంటుందన్నారు.ప్రతి ఒక్కరు చదువుకోవాలని సూచించారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల రూరల్: విత్తన శుద్ధి చేయడం ద్వారా నాట్లు వేసిన నెల రోజుల వరకూ పంటకు ఎటువంటి తెగుళ్లు సోకకుండా రక్షించుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు తెలిపారు. ముకుందపురంలో శనివారం పోలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరి విత్తనాలను తప్పకుండా విత్తనశుద్ధి చేయాలని రైతులకు సూచించారు. విత్తనశుద్ధి చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది మంగరాజు, శ్రావణి, జగ్గారావు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో భారీ వర్షం

మాకవరపాలెం: మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. వారం రోజులుగా అధికంగా కాస్తున్న ఎండలతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి అధిక ఎండ కాసింది. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో ప్రజలకు ఉపశమనం లభించింది. మెట్ట ప్రాంతాల్లో వరి నాట్లు వేసుకునేందుకు ఈ వర్షం కొంతమేర మేలు చేసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.